నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
శనివారం | 01 | జూన్ 2024
పేజీలు 8

# ఎస్సీ,ఎస్టీ కేసు పై కోర్టును ఆశ్రయించిన బుగ్గన

- ఎఫ్ ఐ ఆర్ కొట్టివేయాలంటూ అభ్యర్థన
- విచారణకు రాని మంత్రి పిటిషన్


రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

**కర్నూలు, సూర్య ప్రతినిధి :** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గత నెలలో తనపై నమోదైన ఎస్సీ ఎస్టీ కేసుపై రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. బేతంచెర్ల పోలీసు స్టేషనులో గత నెల 13న నమోదైన ఎఫ్ఐఆర్ 109 /2024ను రద్దు చేయాలని ఆయన అదే నెల 21న కోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. సిపిఆర్ఎల్ నంబరు 3720/ 2024తో కోర్టులో పిటిషన్ అడ్మిట్ అయినట్లు ఈ కేసులో బాధితులు పిఎన్ బాబు తెలిపారు. ప్రస్తుతం ఈ పిటిషన్ న్యాయ స్థానం పరిశీలనలో ఉందని త్వరలోనే విచారణకు వస్తుందని ఆయన తెలిపారు. గత నెల 13వ తేదీన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా మంత్రి బుగ్గగను అనుసరిస్తున్నారన్న ఆగ్రహంతోపై మంత్రి అనుచరులు ఆయన ఇంటి ముందే దాడి చేసి తన కారును ధ్వంసం చేయడమే కాకుండా స్వయంగా మంత్రి బుగ్గన తనను కులం పేరుతో దూషించారని

మిగతా 2లో

# ఓట్ల లెక్కింపు "కౌంట్ డౌన్"

- కౌంటింగ్‌కు నాలుగు రోజులు
- నంద్యాల ఫలితం 21వ రౌండ్‌లో
- పోలూరుతో మొదలు..బివి నగర్‌తో ముగింపు
- నంద్యాల మండలంతో ప్రారంభం.. గోస్పాడు మండలంతో ఫలితం
- 286 బూత్‌లు..21 రౌండ్లు.. చివరి రౌండ్‌లో ఆరు బూత్‌లు
- బూత్‌లు..గ్రామాల వారిగా మెజార్టీ పై లెక్కలు


కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ , జిల్లా ఎస్పీ (ఫైల్‌ఫోటో)

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుకు కౌంట్‌డౌన్ మొదలైంది. ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. కౌంటింగ్‌కు నాలుగు రోజులు మాత్రమే మిగిలింది.నంద్యాల జిల్లా కేంద్రమైన నంద్యాల నియోజకవర్గం ఫలితం 21వ రౌండ్‌లో రానుంది. నంద్యాల నియోజకవర్గంలో 2,73,938 మంది ఓటర్లు ఉండగా 2,05,190 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గోస్పాడు మండలంలో 31,365 ఓట్లకు గాను 28,449 ఓట్లు పోల్ అయ్యాయి. నంద్యాల మండలంలో 44,944 ఓట్లకు గాను 38,681 ఓట్లు , నంద్యాల పట్టణంలో 1,97,629 ఓట్లకు గాను 1,38,060 ఓట్లు పోల్ అయ్యాయి. అత్యధికంగా గోస్పాడు మండలంలో 90.7 శాతం, అత్యల్పంగా నంద్యాల

మిగతా 2లో

- యధేచ్ఛగా ఎర్రమట్టి తవ్వకాలు
- ఎర్రమట్టి రహదారి విస్తరణ వెంచర్ల ఏర్పాటుకు తవ్వకాలు
- నిబంధనలకు తూట్లు ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు
- పేరుకే సాగు భూములు మెరక..కాని చేసేది మాత్రం పక్కాగా వ్యాపారం

# కేజీఎఫ్‌ను తలపిస్తున్న నాగలూటి


తహసిల్దార్, పోలీసులు పర్యవేక్షిస్తున్న దృశ్యం


నాగలూటిలో అక్రమంగా రోడ్డు విస్తరణకు ఎర్రమట్టి తవ్వకాలు

**మిడ్తూరు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని నాగలూటి గ్రామంలో ఎర్రమట్టి తవ్వకాలు కేజీఎఫ్‌ను తలపిస్తుందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ గ్రామంలో యదేచ్ఛగా అక్రమ ఎర్రమట్టి తవ్వకాలు కొనసాగుతున్నప్పటికి అధికార యంత్రాంగం మైనింగ్‌శాఖ అధికారులు మమూళ్ళకు పాల్పడి చూసి చూడనట్లు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో అక్రమ మట్టి తవ్వకాలు అదుపు లేకుండా రహదారి విస్తరణకు యధేచ్ఛగా పొలాలు ఇలా ఎక్కడపడితే అక్కడ మట్టి, గ్రావెల్ తవ్వి రహదారుల కాంట్రాక్టర్ సొమ్ము చేసుకుంటున్నాడు. రాత్రివేళ తవ్వకాలు సాగిస్తూ కోట్ల విలువైన మట్టిని అక్రమంగా తరలిస్తూ కొన్ని నెలల నుండి ఇలా జరుగుతున్నా రెవెన్యూ మరియు మైనింగ్, జలవనరులశాఖ అధికారులు పట్టించుకోని పరిస్థితి. పొలాలలో యధేచ్ఛగా అక్రమ మట్టి తవ్వుతూ పేరుకే సాగు భూములు మెరక.. కాని చేసేది మాత్రం పక్కాగా వ్యాపారం. గ్రావెల్ రవాణా రహదారుల విస్తరణకు యధేచ్ఛగా కొనసాగుతుంది. మట్టి రవాణాకు మైనింగ్‌శాఖ నుంచి కాని రెవెన్యూ శాఖ గాని ఎలాంటి అనుమతులు లేకున్నా

మిగతా 2లో

# చెరువు మట్టి దోపిడీలో 'దొంగాట'


చెరువులో మట్టిని తోడేస్తున్న దృశ్యం

- పేరు రైతులది.. దోపిడీ ఇటికెల బట్టీలది..
- ఒకే పొలంలో వేల క్యూబెక్ మీటర్ల మేరకు మట్టి నిలువ
- అడ్డగోలు అనుమతులు .. పైరవీలే చెల్లుబాటు
- దిగువ అధికారులతో ఇష్టారాజ్యం

**ఎమ్మిగనూరు మేజర్ న్యూస్ ప్రతినిధి :** చెరువు మట్టిలో తవ్వకాల్లో దొంగాట మొదలైంది. పేరురైతులది.. నోరు ఇటుక బట్టీలది.. ఈ తతంగమంతా నడుపుతున్నది తుంగభద్ర దిగువ కాలువ అధికారులదే అన్నది స్పష్టం అవుతుంది.. ఒక రైతుకు పొలంలో వేసుకునేందుకు ఇవ్వాల్సిన మట్టి శాతం కంటే ఎక్కువ క్యూబెక్ మీటర్లు ఒకే చోట నిలువ ఉండటం ఎందుకు తార్కణం..కాసులకు అలవాటు పడ్డ అధికారులు.. దేశాయి చెరువు మట్టిని అప్పనంగా అమ్మేసుకుంటున్నారని ఆరోపణలు బలంగా ఉన్నాయి..అధికారులకు రాజకీయ పైరవీలు తోడవడంతో దోచుకున్నోడికి దోచుకున్నంత చెరువు మట్టి

మిగతా 2లో

# డోన్ నియోజకవర్గ ఓట్ల మాక్ కౌంటింగ్



**డోన్,మేజర్ న్యూస్ :** డోన్ శాసన సభా నియోజకవర్గంలో పోలైన ఓట్ల లెక్కింపు చేసే పద్ధతిపై శుక్రవారం నంద్యాలలోని కౌంటింగ్ కేంద్రంలో మాక్ కౌంటింగ్ నిర్వహించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. డోన్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపును చేపట్టే విధానంపై పోటీలో ఉన్న అభ్యర్థులకు, ఓట్ల లెక్కింపులో పాల్గొనే ప్రభుత్వ సిబ్బందికి తెలియజేసేందుకు మాక్ కౌంటింగ్ ప్రక్రియను చేపట్టామని వారు పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు రోజు ఎలాంటి అవాంతరాలు ఎదురు కాకుండా తగిన పద్ధతులు పాటించేందుకు

మిగతా 7లో

## భద్రత ఏర్పాట్లను కర్నూలు రేంజ్ డిఐజి పరిశీలన


తనిఖీ అనంతరం రిజిస్ట్రర్‌లో సంతకం చేస్తున్న రేంజ్ డిఐజి

7లో

## కౌంటింగ్ ప్రక్రియలో పొరపాట్లకు తావు లేకుండా చూడాలి

- జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జి.సృజన

7లో

సూర్య
శనివారం | 01 | జూన్ 2024

# కేజీఎఫ్‌ను తలపిస్తున్న నాగలూటీ

(మొదటి పేజి తరువాయి)

క్షేత్రస్థాయిలో జరుగుతున్న దానికి పొంతన కనిపించడం లేదు. ఈ అక్రమాలకు అధికారులు కన్నెత్తి చూడడం లేదు. అధికారులు కూడా వ్యవసాయ అవసరాలకు, గ్రామ అవసరాలకు, వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించు కుంటే మాత్రమే అనుమతులు కావాలా వెంటనే పోలీసులు రెవెన్యూ అధికారులు వారిపై చర్యలు తీసుకుంటారు. అదే పెద్ద కాంట్రాక్టర్ కావడంతో వారిపై చర్యలు తీసుకోవడం లేదని నిబంధనలను అతిక్రమించి మట్టి తవ్వకాలూ జరిపిన పొలాలలో మట్టి దాదాపుగా 10 నుంచి 15 అడుగుల లోతును అక్రమంగా తవ్వుతున్నారు. దీనిపై అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడం గమనార్హం. ఈ గ్రామంలో ఎర్రమట్టి భూములు అధికంగా ఉండడంతో నూతనంగా చేపడుతున్న హైవే రహదారి పనులు, నందికోట్కూరు పట్టణంలోని వెంచర్లకు గ్రావెల్‌ను నాగలూటి నందికోట్కూరు రోడ్డుపై భారీ వాహనాలతో టిప్పర్లతో నిరంతరం తరలిస్తుండడంతో గ్రామ రహదారులు సైతం చిద్రమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నాగలూటి నందికోట్కూరు వెళ్ళే ప్రధాన రహదారి మిద్దూరు, నాగలూటి రహదారుల వెంట గ్రావెల్‌తో అధికలోడు వెళుతూ రహదారులపై మట్టి పడుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతూ అడపాదడపా వాహనచోదకులు అదుపు తప్పి ప్రమాద బారిన పడి హాస్పిటల్ పాలవుతున్నారు. నాగలూటి గ్రామంలో ఎర్రమట్టి పొలాల రైతుల నుండి మధ్యవర్తిత్వం ద్వారా హైవే రోడ్డు ఏర్పాటుకు పనులను కంపెనీ కాంట్రాక్టర్ తక్కువ రేట్లకే రైతుల దగ్గర 3 నుండి 6 లక్షలకు మట్టిని మాత్రమే కొనుగోలు చేసి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే యధేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు.వీరికి వాల్టా చట్టం వర్తించదా అంటూ నిబంధన మేరకు విరుద్ధంగా మైనింగ్ నిబంధనలకు విరుద్ధంగా యధేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు. అదే కాంట్రాక్టరుకు ఒక రూలు, రైతులకైతే చట్టం వర్తిస్తుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సందెట్లో సడేమియా అన్నట్లుగా ఆ గ్రామ నాయకుడు విస్తరణ చేపడుతున్న కంపెనీ యజమానితో రైతుల పొలాలకు మధ్యవర్తిత్వం నడిపి అతను మామూళ్ళు తీసుకుంటూ అక్రమార్జనకు తెరలేపాడని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. ఇది ఇలా ఉండగా అక్రమ మట్టి తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాలలో పొలాలకు వెళ్ళే రహదారులు లేకుండా చేశారని సమీప పొలాలకు వెళ్ళే రైతులు మట్టి ప్రాంతంలో ఉండే చుట్టు ప్రక్కల రైతులు మా పొలాలకు ఎలా వెళ్ళాలని అంటూ అక్రమ మట్టి తవ్వకాలు చేపడుతున్న కంపెనీ వారిని ప్రశ్నించగా అమ్మిన రైతులను అడగాలంటూ దురుసుగా ప్రవర్తించారని రైతులు లబోదిబోమంటున్నారు. ఎవరికి చెప్పుకోలేక అయోమయంలో ఉన్నారు. అలాగే అక్కడే ఉన్న దేవాలయ భూమిని సైతం అక్రమంగా ఎర్రమట్టిని తరలించి మరలా గుర్తించి ఆ యొక్క భూమిని నల్లమట్టితో నింపడం కొసమెరుపు. ఇంత జరిగినా అధికారులు, మైనింగ్ యంత్రాంగం పట్టించుకోకపోవడంతో పత్రికల్లో వచ్చినప్పుడు మాత్రమే తూతూ మంత్రంగా పరిశీలించి చర్యలు తీసుకుంటాం ఏమి జరుగలేదని నివేదిక ఇస్తుండం కొస మెరుపు. దీనిపై ఇప్పటికైన అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారా..లేదా వేచి చూడాలి మరీ..

# ఎస్సీ ,ఎస్టీ కేసు పై కోర్టును ఆశ్రయించిన బుగ్గన

(మొదటి పేజి తరువాయి)

స్వతంత్ర అభ్యర్థి పిఎన్ బాబు అదే రోజు బేతంచెర్ల పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. దాంతో మంత్రి బుగ్గనతో పాటు ఆయన అనుచరుల పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ ప్రారంభించారు. అదే రోజు ఒక మహిళ తనను పిఎన్ బాబు అసభ్య పదజాలంతో దూషించారని మహిళలని అని చూడకుండా లైంగిక వేధింపులకు పాల్పడ్డారని బేతంచెర్ల పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. దీనిపై కూడా పోలీసులు పిఎన్ బాబుపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో పిఎన్ బాబు ఫిర్యాదుపై డోన్ డిఎస్పి శ్రీనివాస రెడ్డికి కాకుండా విచారణ బాధ్యతలు ఇతర జిల్లాల పోలీసులకు అప్పగించి పారదర్శకంగా విచారించాలని స్వతంత్ర అభ్యర్థి పిఎన్ బాబు రాష్ట్ర ఎన్నికల కమిషన్, డిజిపిలకు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఉన్నతాధికారుల నుంచి సానుకూల స్పందన వస్తుందని పిఎన్ బాబు ఆశాభావంతో ఉండగా మంత్రి బుగ్గన తనపై నమోదైన కేసును కొట్టివేయలని కోరుతూ ఉన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. కాగా ఈ పిటిషన్‌లో ఆయన డోన్ వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా కాకుండా ఒక వ్యాపారవేత్తగా పేర్కొనడం గమనార్హం. ఇదిలా ఉండగా పోటోల ఉన్న అభ్యర్థలపై ఈ నెల 6వ తేదీ వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హై కోర్టు ఇచ్చిన ఆదేశాలతో ప్రస్తుతం బుగ్గన ఊపిరి పీల్చుకున్నా ఆ తరువాత తీర్పు తనకు వర్తించదన్న ఆందోళనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై హై కోర్టు ఎపుడు విచారణ చేపడుతుందో ప్రస్తుతం ఎలాంటి సమాచారం లేకపోవడం, ఎన్నికల్లో ఫలితాల ప్రభావం తదితర పరిణామాల నేపథ్యంలో మంత్రి బుగ్గన భవితవ్యంపై ప్రజల్లో ఆసక్తికర చర్చ జరుగుతుండటం గమనార్హం.

# ఓట్ల లెక్కింపు 'కౌంట్ డౌన్'

(మొదటి పేజి తరువాయి)

పట్టణంలో 69.8 శాతం నమోదైంది. నంద్యాల మండలంలో 86 శాతం పోలింగ్ నమోదుతో నంద్యాల నియోజకవర్గంలో 74.9 శాతం పోలింగ్ నమోదైంది. నంద్యాల నియోజకవర్గంలో 286 బూత్‌లలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓట్ల లెక్కింపు నంద్యాల మండలం పోలూరుతో మొదలు కానుంది. గోస్పాడు మండలం బివి నగర్‌తో ఓటర్ల లెక్కింపు ముగియనుంది. నంద్యాల మండలం నుంచి ప్రారంభం కానున్న ఓట్ల లెక్కింపు గోస్పాడు మండలం ఓట్ల లెక్కింపుతో ఫలితం వెలువడనుంది. ఒక్కొక్క రౌండ్‌లో 14 టేబుళ్లను ఏర్పాటు చేసి 14 బూత్‌ల ఓట్ల లెక్కింపును జరుపనున్నారు. చివరి రౌండ్‌లో ఆరు బూత్‌లు మాత్రమే ఉంటాయి. బూత్‌లు, గ్రామాల వారిగా సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు మెజార్టీ లెక్కలను వేసుకుంటున్నారు. నంద్యాల నియోజకవర్గంలో మొదటి రౌండ్‌లో పోలూరులోని ఐదు బూత్‌లు, మునగాల, రాయమాల్పూరం, పులిమద్దిలోని రెండు బూత్‌లు, భీమవరంలోని రెండు బూత్‌లు, కొత్తపల్లిలోని మూడు బూత్‌లతో మొదటి రౌండ్‌ను లెక్కించనున్నారు. రెండవ రౌండ్‌లో బిళ్ళలాపురంలో రెండు బూత్‌లు, పెద్ద కొట్టాల ఐదు బూత్‌లు, సుగాలిమెట్ట(అబాండం తాండ) ఒక బూత్, నంద్యాల పట్టణంలోని ఎస్ఆర్‌బిసి కాలనీ , వైఎస్ నగర్‌లోని మూడు బూత్‌లు రెండవ రౌండ్‌లో, మూడవ రౌండ్‌లో వైఎస్సార్‌నగర్‌లోని మూడు బూత్‌లు, నంద్యాల పట్టణంలోని 31 నుంచి 41 బూత్‌లు, 4వ రౌండ్‌లో 42వ బూత్ నుంచి 55వ బూత్ వరకు , 5వ రౌండ్ 56 నుంచి 69 వరకు, 6వ రౌండ్‌లో 70 నుంచి 83 వరకు, 7వ రౌండ్‌లో 84వ బూత్ నుంచి 97వ బూత్ వరకు, 8వ రౌండ్‌లో 98వ బూత్‌నుంచి 111బూత్ వరకు, 9వ రౌండ్‌లో 112వ బూత్ నుంచి 125 వరకు, 10వ రౌండ్‌లో 126వ బూత్ నుంచి 138వ బూత్ వరకు, 11వ రౌండ్‌లో 139వ బూత్ నుంచి 152వ బూత్ వరకు, 12వ రౌండ్‌లో 153వ బూత్ నుంయి 166వ బూత్ వరకు, 13వ రౌండ్‌లో 167వ బూత్‌నుంచి 178వ బూత్ వరకు, 14వ రౌండ్‌లో 179వ బూత్ నుంచి 192వ బూత్ వరకు, 15వ రౌండ్‌లో 193వ బూత్ నుంచి నంద్యాల పట్టణంలోని 200 బూత్‌తోపాటు వెంకటేశ్వరపురంలోని ఒక బూత్, ఊడుమాల్పూరంలోని ఒక బూత్, పాండురంగాపురంలోని నాలుగు బూత్‌లు, 16వ రౌండ్‌లో చాపిరేవులలోని నాలుగు బూత్‌లు, పుసులూరులోని రెండు బూత్‌లు, బ్రహ్మణపల్లెలోని 1 బూత్, మిట్నాలలోని రెండు బూత్‌లు, గుంతనాలలోని ఒక బూత్, కానాలలోని 4 బూత్‌లు 17వ రౌండ్‌లో, కానాలలోని 5వ బూత్, హెచ్ఎస్ కొట్టాలలో ఒక బూత్, రైతునగరంలోని మూడు బూత్‌లు, అయ్యలూరులోని ఆరు బూత్‌లు, పొన్నాపురంలోని మూడు బూత్‌లు, 18 రౌండ్‌లో పొన్నాపురంలోని చివరి రెండు బూత్‌లు, చాబోలులోని ఆరు బూత్‌లు, సాంబవరం, పార్వతీపురంలోని రెండు బూత్‌లు, దీబగుంట్లలోని నాలుగు బూత్‌లు, దీబగుంట్లలోని నాలుగు బూత్‌లు, 19వ రౌండ్‌లో కానాలపల్లెలోని రెండు బూత్‌లు, నెహ్రూనగరం, ఎస్ నాగులవరం, ఎం చింతకుంట్ల, జులేపల్లెలోని రెండు బూత్‌లు, పసురపాడులోని రెండు బూత్‌లు, తేళ్ళపురి, రాయపాడు, ఎస్ కూలూరు మరియు తేళ్ళపురి, ఒంటివెలగల ఒక బూత్, గోస్పాడు ఒక బూత్, 20వ రౌండ్‌లో గోస్పాడులోని మిగిలిన మూడు బూత్‌లు, జిల్లెలలోని నాలుగు బూత్‌లు, జిల్లెల్ల మరియు సత్యనారాయపురంలోని ఒక బూత్, ఎం కృష్ణాపురంలో రెండు బూత్‌లు, యాళ్ళూరులోని నాలుగు బూత్‌లు, 21వ రౌండ్‌లో యాళ్ళూరులో మిగిలిన ఐదు బూత్‌లు, బివి నగర్ ఒక బూత్‌తో ఓట్ల లెక్కింపు పూర్తి కానుంది. ఓట్ల లెక్కింపు జరిగే మంగళవారం సాయంత్రానికి తుది ఫలితం వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. నంద్యాల నియోజకవర్గంలో సర్వీస్ ఓట్లు 508 ఓట్లతో కలిపి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 5265 ఓట్లకు గాను 4090 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. సర్వీస్ ఓటర్లు ఎంత మంది ఓటు హక్కు వినియోగించుకున్నది కౌంటింగ్ రోజున తేలనుంది.

# చెరువు మట్టి దోపిడీలో "దొంగాట"

(మొదటి పేజి తరువాయి)



ఒకే చోట మట్టిని నిలువ ఉంచుతున్న దృశ్యం

అన్నంతగా ప్రభుత్వ ఆదాయాలకు గండి కొట్టి దోచేసుకుంటున్నారు. తుంగభద్ర దిగువ కాలువ అధికారులు అందుబాటులో లేకున్నప్పటికీ ఆ అనుమతి కింది స్థాయి అధికారులు ఇచ్చారా అన్నది తెలవాలి. ఒక రైతుకు 250 క్యూబెక్ మీటర్లు మట్టి అనుమతి ఇవ్వాల్సి ఉండగా.. ఒకే చోట ఒకే రోజు 1000 క్యూబెక్ మీటర్ల మేరకు దేశాయ్ మట్టిని తోడేసుకున్నారు.. చెరువులో రెండు ఇటాచీలు ఒక జెసిపి, దాదాపు 20 ట్రాక్టర్లు మట్టిని తోడేయడం శుక్రవారం ప్రారంభించాయి.. ఇందుకు అక్కడ స్థానిక నాయకులు కార్యకర్తలు రైతుల పేరిట ఉంటూ మట్టి నిలువలకు తోడ్పాటు అందిస్తున్నారు.. ఇక్కడ అధికారులు కూడా ఒక్కొక్కరికి ఒక న్యాయం మరొకరికి మరో న్యాయం చేపట్టడం విడ్డూరంగా కనిపిస్తుంది గత నాలుగు రోజుల క్రితం నందవరం మండలం తహసిల్దార్ అదే పులచింత చెరువులో ప్రభుత్వానికి సంబంధించిన కట్టడాలకు గ్రావెల్ తరలిస్తుండగా ఒక జెసిపి తోపాటు కొన్ని ట్రాక్టర్లను స్వాధీనపరచుకొని కేసులో ఇరికించేశారు అన్నది సమాచారం ఉండగా అది కూడా ఒక వాట్సాప్ మెసేజ్ ద్వారా జరిగిపోయింది అని తెలుస్తుంది.. ఇది మండలంలోని ఒక నాయకుడు ప్రభుత్వ పనుల కు తరలిస్తుంటే కేసులు బనాయించి అడ్డుకున్న అధికారులు దేశాయ్ చెరువు మట్టి తరలిపోతుంటే ఎందుకు చోద్యం చూస్తున్నారు అన్నది ప్రశ్నార్థకంగా మారింది.. దీంతో మండలంలో ప్రధాన పార్టీ నాయకుడి కంటే ఇటుక బట్టే వ్యాపారులకే పై చేయిగా కనిపించింది.. ప్రభుత్వ పనులకు అడ్డుపడిన అధికారులు.. ఇటుక బట్టే యజమానులు తవ్వుతున్న మట్టిపై ఎందుకు కేసులు పెట్టడం లేదని మండలంలోని రైతులు ప్రశ్నిస్తున్నారు.

**గతంలో కూడా ఇదే ప్రక్రియ** : నందవరం మండలంలోని దేశాయి చెరువు నుండి మట్టి తవ్వకాలకు నిత్యం పాలు పడుతున్న వ్యక్తులు ఒక ఇటుక బట్టీల వారే అన్నది నగ్న సత్యం.. గతంలో కూడా దిగువ కాలువ అధికారులు రైతుల పేరుమీద అనుమతులు ఇస్తే ధర్మాపురం సమీపంలోని రోడ్డుకు ఎడమ వైపున ఇటుక బట్టి వ్యాపారులు వేల క్యూబెక్ మీటర్ల చెరువు మట్టి నిలువ చేసుకున్నారు. అదేతతంగంగా జాతీయ రహదారి 167 కుడివైపుకు మట్టినిలువలు మార్చేశారు. మరో మారు అదే అలవాటుమళ్లీ ఈ ఏడాది కూడా మొదలు పెట్టారు అన్నది ప్రధాన సమాచారం..

**రైతుల అవసరాలకు మట్టి ఇస్తే ఒట్టు** : చెరువులోని మట్టిని తోడుకోవడానికి చాలామంది రైతులు ఎల్ ఎల్ సి అధికారులు అనుమతులు కోరగా నిజమైన రైతులకు మాత్రం వారు మట్టి తవ్వకాలకు అనుమతులు ఇస్తే ఒట్టు.. అంటూ నందవరం మండలంలోని చాలా మంది రైతులందరూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తుంటారు.. ఇటుక బట్టీల వ్యాపారులచే వేల రూపాయలు దండుకొని పొలాల చెరువు మట్టి తోడిపి స్తున్న అధికారులు రైతు పొలాలు బీడు భూములుగా మారుతున్న పట్టించుకున్న పాపాన పోలేదని వాపోతున్నారు.. అలాంటి అధికారులు శాపం వల్ల నిజమైన రైతులకు దేశాయి చెరువు మట్టి అందడం లేదన్నది ప్రధాన ఆరోపణ..చెరువుకు సమీపంలో ఉన్న ధర్మాపురం, నందవరం, హలహర్వి,, జగ్గా పురం, బాపురం గ్రామాల రైతులు అనేకసార్లు నిరసన వ్యక్తం చేసిన సంఘటనలు లేకపోలేదు..వివరణ కోరెందుకుసంబంధించినఅధికారులు చరవాణి ద్వారా అందుబాటులోకి రాలేదు..

## ప్రభుత్వ సర్వజన వైద్యశాల నూతన సూపరింటెండెంట్‌గా డా.సి.ప్రభాకర్ రెడ్డి

**పాత సూపరింటెండెంట్ పదవి విరమణ**

**నూతన సూపరింటెండెంట్‌గా డా.సి.ప్రభాకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ**



పాత సూపరిటెండెంట్‌తో నూతన సూపరిటెండెంట్

**కర్నూల్ క్రైమ్, మేజర్ న్యూస్** : కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ప్రభాకర్ రెడ్డి శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. వెంకట రంగారెడ్డి పదవి విరమణ చేయడంతో పదవీ విరమణ అనంతరం ఆయన ప్రభాకర్ రెడ్డికి సూపరింటెండెంట్‌గా బాధితులను అప్పజెప్పారు.ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్, డా.సి.ప్రభాకర్ రెడ్డి, మాట్లాడుతూ,కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఆసుపత్రిని ప్రక్షాళన చేస్తానని ,ఆసుపత్రిలో ఉన్న సమస్యల పై ప్రత్యేక దృష్టి పెడతానని తెలియజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే వైద్యం ప్రజలకు అందేలా చూస్తానని,ఎలాంటి అవకతవకలున్న వాటి పై చర్యలు చేపట్టి పరిష్కరిస్తానని,అలాగే సెక్యూరిటీ మరియు శానిటేషన్, పేస్ట్ కంట్రోల్, పై ప్రత్యేక దృష్టి పెడతానని అన్నారు.ఈ కార్యక్రమానికి కర్నూలు వైద్య కళాశాల అడిషనల్ డీఎంఈమరియు ప్రిన్సిపాల్, డా.చిట్టి నరసమ్మ, సి.ఎస్.ఆర్.ఎం.ఓ డా.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సి.ఎస్.ఆర్.ఎం.ఓ, డా.హేమన ళిని, ఆర్.ఎం.ఓ డా.వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నగాంజన్, డా.కిరణ్ కుమార్, ఆసుపత్రి ఏడి, శ్రీ.అనిల్ కుమార్ రెడ్డి, మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రయివేట్ పాఠశాలల వద్ద ఫీజుల పట్టికను ఏర్పాటు చేయాలి

## – టీఎన్ఎస్ఎఫ్ నాయకుల డిమాండ్



ధర్నా చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

**కౌతాళం, మేజర్‌న్యూస్:** కౌతాళం పట్టణంలోని ప్రతి ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ముందు బహిరంగంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజుల పట్టికను ఏర్పాటు చేయాలని టీఎన్ఎస్ఎఫ్ మంత్రాలయం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బి.టి.రామచంద్రనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌతాళంలో ప్రయివేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా కూడా స్థానిక అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కేవలం సీటుకు మాత్రమే పరిమితం అవుతున్నారన్నారు. ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ముందు బహిరంగంగా ఫీజుల పట్టిక వేసే విధంగా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ విద్యాశాఖ అధికారులు ఫీజుల పట్టిక బహిరంగంగా వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మహాదేవ, అద్దాల శ్రీరామ్, నాగరాజు, విక్రమ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టొబాకో డే దినోత్సవం

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఆర్.వెంకట రమణ ప్రపంచ పొగాకు వ్యతిరేఖ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఆర్.వెంకట రమణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పొగాకు ఒక వినియోగంలో స్వల్పంగా తగ్గుదల ఉన్నప్పటికీ ప్రతి సంవత్సరం టొబాకో పదార్థాల వలన మరణాల రేటు పెరుగుతుందన్నారు. పొగాకు పదార్థాలను వాడడం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, గొంతు క్యాన్సర్, పక్షవాతము మరియు శ్వాసకోశ వ్యాధులు వస్తాయన్నారు. దూమపానం వలన మానసిక ఆరోగ్య రుగ్మతలను కలుగజేస్తాయని, ఆందోళన, నిరాశ, బైపొలర్ డిజార్డర్ లాంటివి దరిచేరుతాయన్నారు. ముఖ్యంగా యుక్త వయసులో ఉన్నవారు ఫ్యాక్టరీ కార్మికులు, పొగాకు రైతులు, గర్భిణీ స్త్రీలు మరియు పాఠశాల విద్యార్థులకు పొగాకు వలన కలిగేటటువంటి సమస్యలను వివరించే కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జూన్ 5వతేది తర్వాత నుండి పొగాకు రహిత సమాజాన్ని ఏర్పాటు చేయడం కోసం ప్రజలు మరియు రోగుల కోసం ప్రతిజ్ఞ కార్యక్రమాలను 20 రోజులపాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఓ డాక్టర్ శారధ బాయ్, ఎన్‌సిడి జిల్లా కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ కాంతారావు నాయక్ మరియు ఎన్‌హెచ్ నిర్వహణ అధికారి డాక్టర్ సునీత, డిస్ట్రిక్ ఇమ్మ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రసన్న లక్ష్మి, ఆయుర్వేదిక్ మెడికల ఆఫీసర్ డాక్టర్ యశోద, నేషనల్ టొబాకో కంట్‌రోల్ నిర్వహణ కో ఆర్డినేటర్ చిన్న వీరన్న, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది మరియు డిఇఐసి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



టొబాకో డే సందర్భంగా అవగాహన ర్యాలీ చేపడుతున్న దృశ్యం

# ఎన్నికల కౌంటింగ్ రోజు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు : సిఐ

## – ఆటో మైక్ ద్వారా ప్రచారం



**కొలిమిగుండ్ల, మేజర్‌న్యూస్ :** జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవనిఆటో మైక్ ద్వార కొలిమిగుండ్ల సి.ఐ గోపినాథ్ రెడ్డి ప్రజలకు తెలిపారు. రాష్ట్ర, జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎలక్షన్ కోడ్ అమలులో ఉంటుందని దానిని కట్టుదిట్టంగా అమలు చేయడం జరుగుతుందని మండలంలో ఎక్కడబడితే అక్కడ గుంపులుగా సమూహాలుగా ప్రజలు గూమిగూడటం రాజకీయ నాయకుల జయాపజయాలుపై వాదోపవాదాలు చేయడం వంటివి ప్రజలు చేయకూడదని 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన తెలిపారు. అలాగే కౌంటింగ్ రోజు కూడా కౌంటింగ్ కేంద్రాల వద్దకు నాయకులు, కార్యకర్తలు కాన్వాయ్‌లతో వెళ్లకూడదని అనుమతి ఉన్న వాహనాలతో మాత్రమే సంబంధిత నాయకులు పోలింగ్ ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రం వరకు వెళ్లాలని మిగతా వారిని ఎవ్వరినీ కౌంటింగ్ కేంద్రం వద్దకు అనుమతించేది లేదని అన్నారు. అంతేకాక కౌంటింగ్ పూర్తి అయిన తరువాత సంబరాలు, విజయోత్సవ ర్యాలీలకు ఎటువంటి అనుమతి లేదని ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని 8వ తేదీ వరకు కేంద్ర బలగాలను కొనసాగిస్తామని ప్రజలు నిబంధనలకు లోబడి వ్యవహరించాలని శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని ఆయన తెలిపారు.

# రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై కొత్త ప్రభుత్వం దృష్టి పెట్టాలి

## – జూన్ 10న సిద్దేశ్వరం అలుగు వద్ద వార్షికోత్సవం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర విభజన జరిగిన పదేళ్లయినా రాయలసీమ హక్కుల అమలుపై నిర్లక్ష్యంమేనా అని...మరికొన్ని రోజుల్లో నూతన ప్రభుత్వం రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలని సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. శుక్రవారం సాగునీటి సాధన సమితి కార్యాలయంలో సభ్యులతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం రాయలసీమ అభివృద్ధికి అనేక హక్కులను కల్పించినప్పటికీ వాటి అమలులో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా విఫలమయ్యాయన్నారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ చేపట్టిన కృష్ణా జలాలు నీటి పంపకం వల్ల తెలుగుగంగ, గాలేరునగరి, హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టులకు 100సంవత్సరాల్లో ఒకటి లేదా రెండు సంవత్సరాలలో మాత్రమే నీరు లభించే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఇబ్బందులను అధిగమించడానికి దుమ్ముగూడెం నాగార్జున సాగర్ టాల్పాండ్ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను నాగార్జునసాగర్ ఆయకట్టుకు అందించి తద్వారా మిగిలే కృష్ణాజలాలపై ప్రాజెక్టులకు అందించి లక్ష్యంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం కొనసాగింపును రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన విషయాన్ని గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నెత్తికెత్తుకుని రాయలసీమకు తీవ్ర ద్రోహం చేసిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం రాయలసీమ ప్రాజెక్టుల నిర్వహణఖు కూడా సరిగా నిధులు కేటాయించకపోవడంతో రాయలసీమలో నికర జలాలపై నిర్మించిన అన్ని ప్రాజెక్టులు శిథిలావస్థకు చేరుకున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ ప్రజా సంఘాలు ప్రతినిధులు పై అంశాలపై తీర్మాణాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సీమ ప్రజల హృదయ స్పందన సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 8వ వార్షికోత్సవం జూన్ 10న సంగమేశ్వరం వద్ద ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఈసమావేశంలో సీమ విద్యావంతుల వేదిక పాణి, రత్నం, ఏసేపు, రామకృష్ణారెడ్డి, సుంకన్న, రంగారెడ్డి, వివేకానంద సొసైటీ అధ్యక్షులు మధుసూధన్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గోస్పాడు మండల రైతు నాయకులు బాలీశ్వరరెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న సాగునీటి సమితి సభ్యులు

# ముందస్తు అక్రమ అడ్మిషన్స్‌ను అరికట్టాలి

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలి : పి.డి.ఎస్.యూ




**బేతంచెర్ల, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా ముందస్తు అక్రమ అడ్మిషన్స్ చేస్తున్న శ్రీ చైతన్య,శ్రీ నారాయణ,సుమెదా,శ్రీవాని,సరస్వతి శిశుమందిర్,శ్రీవాసవి స్కూళ్లు పై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎం ఈ ఓ సోమశేఖర్ పీడీ ఎస్ యు నంద్యాల జిల్లా అధ్యక్ష్యుడు కే. పవన్ వినతిపత్రం అందించారు. అకాడమిక్ ఇయర్ మొదలు కాక ముందే అక్రమ అడ్మిషన్స్ చేస్తూ , ప్రభుత్వ నిబంధనలు పాటించకూడా స్కూల్ లో పుస్తకాలు అమ్ముతు విద్యార్థుల నుండి అధికాఫీజులు వసూలు చేస్తూ పేద విద్యార్థుల తల్లి దండ్రుల పై భారం వేస్తున్నారు.వీరి అక్రమాలకు కళ్లెం వేయాలని డిమాండ్ చేస్తూ పీడీ ఎస్ యి ఆధ్యర్యం డిమాండ్ లతో కూడిన వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమం లో పీడీ ఎస్ యు నాయుకులు మహేంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కేసులు నమోదు చేస్తాం


రాజకీయ నాయకులకు సూచనలు చేస్తున్న కోసిగి సీఐ ప్రసాద్, కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి

**కౌతాళం, మేజర్‌న్యూస్:** శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కేసులు నమోదు చేస్తామని కోసిగి సీఐ ప్రసాద్, కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు, ఎమ్మిగనూరు డీయస్పీ సీతారామయ్య ఆధ్వర్యంలో పోలీసులు కౌతాళంలో కవాతు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమై మాట్లాడారు. ఎన్నికల ఫలితాల రోజున, ఆ తర్వాత రోజున ఎలాంటి గొడవలు చేయరాదన్నారు. ప్రజాశాంతికి భంగం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. విజయోత్సవ ర్యాలీలు నిషేధమని చెప్పారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని, గుంపులు గుంపులుగా తిరగరాదన్నారు. అలాగే సోషల్ మీడియా గ్రూపుల్లో ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# నిరుపేదల వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ



**కర్నూల్‌రూరల్, మేజర్‌న్యూస్ :** కర్నూలు నగరం నందలి రోజా వీధి నందు నిరుపేద మహిళలకు నిరాశ్రయులకు మానస సేవా సంఘం అధ్యక్షులు బైలుప్పల షఫీయుల్లా 48 వ వార్డు రోజా విధి మహిళ సేవా విభాగం సమన్వయకర్త మీసాల సుమలత నిరుపేద వృద్ధులకు మహిళలకు నిత్యవసర సరుకులు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. సమాజసేవలో ప్రజా సంఘాలు నిరంతరం పని చేయాలని నిరుపేదలకు ఆసరాగా నిలవాలని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మధ్యతరగతి కుటుంబాలకు చేయూత అందించాలని, సేవా సమాజంలో మానవతా ధర్మంతో సహాయ సహకారాలు అందిస్తే దేశంలో ఆకలి చావులు తగ్గించగలము. నిరుపేద అన్నర్తులకు తప్పక సేవా సహకారాలు అందజేయాలని వారి కొరకు ప్రభుత్వాలు సహకరించుటకు ముందుకు రావాలని, మానస సేవా సంఘం అధ్యక్షులు బైలుప్పల షఫీయుల్లా, మహిళా సమన్వయకర్త మీసాల సుమలత, నిరుపేద మహిళలకు నిత్యవసర సరుకులు అందజేశారు.

# ఉపాధి పనులను పరిశీలించిన అంబుర్స్‌పర్సన్

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్:** సంజామల మండలంలోని ముదిగేడు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను మహాత్మాగాంధి జాతీయ గ్రామీన ఉపాధి హామీ పథకం అంబుర్స్‌పర్సన్ శుక్రవారం పరిశీలించారు. గ్రామంలోని కుంటలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం 100 రోజుల పని పూర్తి చేసుకోవాలన్నారు. పనులకు సంబంధించిన వేతనాలు అందరికి అందేలా చూడాలన్నారు. పనికి తగిన కూలీ వచ్చేలా చూసుకోవాలన్నారు. అలాగే ఎప్పటికప్పుడు ఉపాధి పనులు కూలీలకు ఉండేలా ముందుగానే పనులను గుర్తించాలన్నారు. ఉపాధి పనులలో అవనీతికి తావులేకుండా చూడా లన్నారు. ముఖ్యంగా పండ్ల తోటల పెంపకం చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాల న్నారు. ఈ కార్యక్రమం లో ఏపీవో ప్రకాష్, జేఈ నాగలక్ష్మమ్మ, టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఓబులేసు పాల్గొన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న ఉపాధీ హామీ పథకం అధికారులు

సూర్య

శనివారం | 01 జూన్ 2024

### కౌంటింగ్ సిబ్బందికి

## జూన్ 3వ ఓరియంటేషన్ ప్రోగ్రాం

### జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా జి.సృజన



**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** జూన్ 3 వ తేదిన కౌంటింగ్ సిబ్బందికి రాయలసీమ యూనివర్సిటీలోని సంబంధిత కౌంటింగ్ హాల్ లలో ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా జి.సృజన సంబంధిత రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం ఎన్నికల కౌంటింగ్ సన్నద్ధత పై రిటర్నింగ్ అధికారులతో, నోడల్ అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బందికి జూన్ 3 వ తేదిన రాయలసీమ యూనివర్సిటీలోని కౌంటింగ్ హాల్ ల వద్దకు తీసుకొని వెళ్ళి రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్ ల సమక్షంలో ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించే విధంగా చూసుకోవాలని సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో పాణ్యం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు రిటర్నింగ్ అధికారి, కర్నూలు నగర పాలక సంస్థ మునిసిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, కోడుమూరు రిటర్నింగ్ అధికారి, కర్నూలు ఆర్డీఓ శేషి రెడ్డి, పత్తికొండ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ రామలక్ష్మి, ఎమ్మిగనూరు రిటర్నింగ్ అధికారి చిరంజీవి, ఆలూరు రిటర్నింగ్ అధికారి రాము నాయక్, నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పురంధేశ్వరితో రాఘవేంద్ర భేటీ



**కర్నూల్‌రూరల్, మేజర్‌న్యూస్:** ఎన్డీఏ కూటమి అధికారంలోకి రానుంది. ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరిని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర భేటీ అయ్యారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రానిందని, రాష్ట్రంలోఎన్ డి ఏ కూటమి కలసి పోటీ చేసిన అభ్యర్థులు జోష్ లో మునిగి తేలుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రానుందని జోస్యం అని చెప్పారు.

### గ్రామాల్లో సమస్యలుంటే

## పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి



గ్రామస్థులతో మాట్లాడుతున్న సిఐ

**పత్తికొండ టౌన్, మేజర్‌న్యూస్ :** గ్రామాల్లో సమస్యలుంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, చట్టాన్ని అతిక్రమించరాదని సిఐ మురళీ మోహన్ పేర్కొన్నారు. డిజిపి, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం సమస్యాత్మకమైన పులికొండ గ్రామంలో నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, రాష్ట్రంలో 2024 సాధారణ ఎన్నికలు ముగిసిన తరువాత అనేక గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగే సంఘటనలు ఉన్నాయన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత ఏటువంటి గొడవలో పాల్గొనవద్దని, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ ఎస్.ఐలు వెంకటేష్, గోపాలు, శివాజి నాయక్, తుగ్గలి, మద్దికెర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజలతో మాట్లాడుతున్న వైద్యులు

**కౌతాళం, మేజర్‌న్యూస్:** గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిణి పావని అన్నారు. ఈ మేరకు శుక్రవారం కౌతాళంలోని సచివాలయం-3లో ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని చేపట్టారు. రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందించారు. పర్జలు ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ సత్యన్న, పంచాయతీ కార్యదర్శి శివప్ప, సర్పంచ్ పాల్ దినకర్, సచివాలయం ఏఎన్ఎంలు, వైద్యులు, నర్సులు, ఆయాలు, ప్రజలు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రత

### - ఆ రెండు కి.మీలు రెడ్ జోన్

### - జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి



అధికారులకు సూచనలిస్తున్న జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి

**నంద్యాల క్రైం, మేజర్‌న్యూస్:** స్ట్రాంగ్ రూంల వద్ద 24 గంటలు పటిష్ట భద్రత ఉంచామని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్‌జీఎం, శాంతిరామ్, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల వద్ద ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూంలను జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడే ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్‌లో సీసీ ఫుటేజ్‌లను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు సమీపిస్తున్న వేళ జిల్లా వ్యాప్తంగా భద్రత పెంచామన్నారు. స్ట్రాంగ్ రూంల చుట్టూ ఉన్న గగనతలంలో అనధికార డ్రోన్ కార్యకలాపాలను 2కి.మీల మేర నిషేధించామన్నారు. ఎన్నికల కౌంటింగ్ జరుగనున్న ప్రాంతం నుండి చుట్టుపక్కల 2కి.మీల మేరకు రెడ్‌జోన్ ఉంటుందన్నారు. రెడ్‌జోన్ నిబంధనలు వెంటనే అమలులోకి వచ్చేలా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశాల జారీ చేశారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు నిబంధనలు అమలులో ఉంటాయన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి హెచ్చరించారు.

### కల్లుదేవకుంట పిహెచ్‌సి సిబ్బందిపై

## డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ విచారణ



వైద్య సిబ్బందిని విచారిస్తున్న డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ

**మంత్రాలయంరూరల్, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని కల్లుదేవకుంట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న మహబూబ్ బాషపై డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ గోవిందమ్మను విచారించారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణనాయుడులు డిఎంఅండ్‌హెచ్‌ఓను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ, గత 10సంవత్సరాలుగా విధులకు హాజరుకాకుండా ప్రభుత్వ జీతాన్ని మొక్కుతూ, ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో చెలామణి అవుతున్న డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సొమ్ముతో పబ్బం గడుపుతున్న అప్రబుధుడిపై చర్యలు తీసుకోకపోతే ఉధ్యమ బాటపడుతామని డిఎం అండ్ హెచ్‌ఓను హెచ్చరించారు. అయితే గత 10 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వం నుంచి తీసుకున్న జీతాన్ని తిరిగి చెల్లించాలని, ఆవిధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్న, నారాయణ, రాజు, రంగన్న, తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన ఉద్యోగికి ఘనంగా వీడ్కోలు



మదార్‌సాహెబ్‌బును సన్మానిస్తున్న ఎఫ్‌ఆర్‌వో నాశిర్‌ఝా, అటవీశాఖ అధికారులు

**బండిఆత్మకూరు, రూరల్ మేజర్‌న్యూస్ :** అటవీశాఖలో ఫారెస్టు బీట్ ఆఫీసర్ నారాయణాపురంసెక్షన్‌లో పనిచేస్తున్న ఉద్యోగి మదార్ సాహెబ్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. బండిఆత్మకూరు ఫారెస్టు రేంజ్ అధికారి నాశిర్‌ఝా ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాశిర్‌ఝా మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ సహజమని తాము వృత్తిలోఉంచి చేసిన పనులే ఉద్యోగి కీర్తిని చిరకాలం నిలబెడుతాయన్నారు. 34 సంవత్సరాల పాటు ఫారెస్టుశాఖలో వివిధ పదవులలో ఉద్యోగ ధర్మం నిర్వహిస్తూ తన కర్తవ్యాన్ని పూర్తి చేసిన ఎఫ్‌బీవో మదార్‌సాహెబ్‌కు శాలువలు, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం మేళ తాళాల మధ్యన ఫారెస్టు అధికార వాహనంలో ఇంటి దగ్గర వరకు వెళ్ళి వీడ్కోలు పలికారు. తన పదవి విరమణను ఘనంగా నిర్వహించిన ఫారెస్టు రేంజ్ అధికారికి, ఎఫ్‌ఎస్‌వోలకు తోటి సిబ్బందికి మదార్‌సాహెబ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌వోలు వెంకట సుబ్బయ్య, రవీంద్రానాయక్, తేజా, ఎఫ్‌బీవోలు వెంకటరమణ, రామకృష్ణ, హైమావతి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి

### - మెయిన్ రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేస్తే జరిమానాలు తప్పవు

### - సబ్ కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

**ఆదోని, మేజర్ న్యూస్ :** వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన సబ్ కలెక్టర్ కల్పించారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని సబ్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, ఓవర్ స్పీడ్ వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. హెల్మెట్, సీట్ బెల్టు, ట్రాఫిక్‌నిబంధనలను పాటించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్టీఓ నాగేంద్ర, మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ శశిధర దీప్తి, రోడ్డు భవనాల శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ వెంకట ప్రసాద్, ఆర్టీసి డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ అనుపమ, ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మంజునాథ్, రెవిన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ధూమపానం ఆరోగ్యానికి హానికరం



**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** పొగాకు ధూమపానం నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక శేషారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి నందు దంత వైద్యులు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ధూమపానం మద్యం వంటి హానికర పదార్థాలతో శరీరంలో జీర్ణ వ్యవస్థ దెబ్బ తింటుందని ముఖ్యంగా వాటి ప్రభావం ఊపిరితిత్తులు నోటి క్యాన్సర్ వంటి భయంకరమైన నయం కానీ వ్యాధుల పట్ల ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. ప్రజలు ధూమపానం పొగాకు కాలుష్య నివారణకు ప్రాంతాల పైన అవగాహన కలిగి ఉండి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన వ్యాధుల పట్ల పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు .ఈ కార్యక్రమంలో ప్రజాపిత బ్రహ్మ కుమారిస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీతో రైతులకు విత్తనాలు ఎరువులు అందించాలి

### ఏపీ రైతు సంఘం మండల కమిటీ

**ఓర్వకల్లు మేజర్ న్యూస్ :** ఖరీఫ్ సీజన్లో రైతులకు 90% సబ్సిడీతో ఎరువులు విత్తనాలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం మండల కమిటీ సభ్యులు అన్నారు. శుక్రవారం రెవెన్యూ ఇన్స్పెక్టర్ జి రంగస్వామికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రెండు మూడు సంవత్సరాల నుంచి సక్రమంగా వర్షాలు కురవక పంటలు దిగుబడి రాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని అప్పుల ఊబిలో కూరుకు పోయారని ఈ సంవత్సరం వర్షాలు బాగా పడతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు కనుక 90% సబ్సిడీతో రైతులకు విత్తనాలు ఎరువులు అందించాలని లేని పక్షంలో రైతులందరినీ కూడగట్టి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాసుం భాష మహేష్ జగన్నాథం శ్రీరాములు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవు

### రూరల్ సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి



**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడే రోజున గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కర్నూల్ రూరల్ సిఐ కిరణ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఎస్సై రాజారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన నాయకులు గ్రామ పెద్దలతో శాంతి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి సిఐ కిరణ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత గ్రామాల్లో ఒకరి మీద ఒకరు దాడులకు పాల్పడిన అల్లర్లు సృష్టించిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన అటువంటి వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాజకీయాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని గ్రామాలలోని ప్రజలకు తెలియజేయాలన్నారు. అనంతరం ఎస్సై రాజారెడ్డి మాట్లాడుతూ మండలంలోని గ్రామాలలో ఎవరైనా విజయోత్సవ ర్యాలీలు కానీ బాణాసంచాలు పేల్చరాదని ఆరవ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని అంతవరకు అందరూ ప్రశాంతంగా ఉండాలని 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎక్కువగా గుమికూడా రాదని గెలుపోటములు సహజం కాబట్టి కుటుంబాల కోసం కష్టపడి పిల్లలకు మంచి భవిష్యత్తును ఇవ్వడానికి కృషి చేయాలి అని అన్నారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు అదనంగా వేతనం చెల్లించాలి

**ఆస్పరి, మేజర్ న్యూస్ :** ఉపాధి కూలీలకు రోజువారిగా రూ.600లు వేతనం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడుతూ, ప్రతి జాబ్‌కార్డుకు 200 రోజుల పనిదినాలు కల్పించాలని, రెండు పూటల పని విధానాన్ని రద్దు చేయాలని, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని, గడ్డపారకు వేతనం కల్పించాలని, ప్రతి మేటికి మొబైల్ ఇవ్వాలని, అదనంగా వేతనం కల్పించాలని వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు.

# నంద్యాల లాడ్జిలపై పోలీసుల అత్యుత్సాహం

### – గదులు అద్దెకు ఇవ్వవద్దంటూ మౌఖిక ఆదేశాలు

**కర్నూలు, సూర్య ప్రతినిధి :** సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఈనెల 3, 4వ తేదీల్లో నంద్యాల పట్టణంలోని లాడ్జీలలోని గదులు ఎవరికీ అద్దెకు ఇవ్వవద్దరి పోలీసులు హుకుం జారీ చేశారు. ఈ మేరకు లాడ్జి యజమానులతో సమావేశం నిర్వహించి మౌఖికంగా ఆదేశాలు ఇచ్చారు. అయితే పలు పెద్ద లాడ్జీలలో జిల్లాలోని ఇతర నియోజకవర్గాలకు చెందిన రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలకు గదులు అద్దెకు ఇస్తుండటంతో పోలీసులు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసుల తీరుతో చిన్న చిన్న లాడ్జీల యజమానులు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల నుంచి తీసుకున్న అడ్వాన్సును వెనక్కి తీసుకోవాలని, గదులు అద్దెకు ఇస్తే ఇబ్బందులు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నట్లు పేర్కొంటున్నారు. గుర్తింపు పొందిన లాడ్జీ యజమానులు మాత్రం గదులు ఇప్పటికే అద్దెకు ఇచ్చామని ఇపుడు వెనక్కి తీసుకోలేమని పోలీసులకు స్పష్టం చేసినట్లు వెల్లడవుతోంది. పోలీసులు మౌఖిక ఆదేశాలు కాకుండా రాత పూర్వకంగా ఆదేశాలు ఇచ్చి ఉంటే పరిశీలించి ఉండే వారమని స్పష్టం చేశారని తెలిపింది. ఈ అంశంపై పోలీసులకు, లాడ్జీ యజమానుల మధ్య మాటల యుద్ధం నడుస్తోందని రాజకీయ పార్టీల నాయకులు పేర్కొంటున్నారు. గదుల కోసం ఇచ్చిన అడ్వాన్సును వెనక్కి తీసుకోబోమని పోలీసులు ఏమైనా చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే తాము చూసుకుంటామని లాడ్జీ యజమానులకు తెలిపినట్లు సమాచారం. కాగా పోలీసుల మాత్రం లాడ్జీలో గదులు అద్దెకు ఇస్తే అసాంఘిక శక్తులు అక్కడ చేరి శాంతి, భద్రతలకు విఘాతం కలిగిస్తారనే ఉద్దేశ్యంతో అద్దెకు ఇవ్వవద్దని సూచిస్తున్నట్లు రాజకీయ పార్టీ నాయకులకు వివరించినట్లు తెలిసింది. అయితే అలాంటివి ఏవీ జరుగవని పోలీసుకు హామీ ఇచ్చామని రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలిపారు. అయితే ఓట్ల లెక్కింపు ముందు రోజు నంద్యాలలోని లాడ్జీలలో తమ గదుల్లో చేరేందుకు వెళ్లే ఆయా పార్టీల కార్యకర్తలకు ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయోనని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

## అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం : సీఐ



వివిధ పార్టి నాయకులతో మాట్లాడుతున్న సిఐ జయచంద్ర, ఎస్ఐ రమేష్‌రెడ్డి

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్:** ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర, సంజామల ఎస్ఐ రమేష్‌రెడ్డి అన్నారు. సంజామల పోలీస్‌స్టేషన్ ఆవరణంలో వివిధ రాజకీయా పార్టిలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలు జరిగాయని ఈ నెల 4వ తేదిన కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందని ప్రజలు గెలుపు ఓటములపై పంతాలకు, పట్టింపులకు పోవద్దని అందరూ ప్రశాంతంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా గెలిచినవారు సంబరాలు, ర్యాలీలు టాపసులూ పేల్చడం లాంటివి చేయరాదని అందుకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టిని ఉంచడం జరిగిందన్నారు. ఎమైనా చిన్న చిన్న సమస్యలూ వస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టిల నాయకులు,పోలీసులూ పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన బీసీ రాజారెడ్డి

**బనగానపల్లె, మేజర్‌న్యూస్ :** బనగానపల్లె పట్టణంలోని తెలుగుపేటకు చెందిన టీడీపీ నాయకుడు ఎంపీటీసీ కృష్ణన్న కుమారుడు రామాంజనేయులు అనారోగ్యంతో నంద్యాల శాంతిరామ్ హాస్పిటల్ నందు సర్జరీ చేపించుకొని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటుండగా విషయం తెలుసుకున్న బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి శుక్రవారం సాయంత్రం ఇంటికి చేరుకొని రామాంజనేయులు ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని వారిని పరామర్శించారు. అలాగే బీసీ కుటుంబానికి వీరాభిమాని అయిన నాగార్జున అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ హాస్పిటల్ నందు చికిత్స తీసుకొని ఇంటికి రాగా వారిని కూడా బీసీ రాజారెడ్డి పరామర్శించడం జరిగింది.



### పదవీ విరమణ పొందిన
## ఉపాధ్యాయులకు సత్కారం



**బనగానపల్లెరూరల్, న్యూస్:** బనగానపల్లె మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎం.ఈ.వొ స్వరూప అధ్యక్షతన పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు డేవిడ్ పుల్లయ్య, షర్ఫుద్దీన్‌లను పూలమాలలతో సత్కరించి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి బనగానపల్లె మండలశాఖ అద్యక్షులు ఎన్. ప్రతాప్, యు. దస్తగిరి, జిల్లా సహ అద్యక్షులు కె. సత్యప్రకాష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం.ఈ.వొ స్వరూప మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు ఉద్యోగ జీవితంలో నిరంతరం పట్టుదల, ఓర్పుతో విద్యార్థులను తీర్చిదిద్దారని విద్యార్థుల భవిష్యత్తుకై అహర్నిషలు పాటుపడ్డారని వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో జీవించాలని ఆమె తెలిపారు.

### ఉపాధ్యాయులు సి.శ్రీనివాసులు
## పదవి విరమణ సన్మానం




**కల్లూరు, మేజర్‌న్యూస్ :** కల్లూరు మండలంలో ఎ.నాగలాపురం గ్రామంలో ఎంపిపిఎస్ పాఠశాల పనిచేస్తున్న ఉపాధ్యాయులు సి.శ్రీనివాసులు, ఎస్ జిటికి పదవి విరమణ సన్మాన కార్యక్రమంను మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు మాట్లాడారు పదవి విరమణ పొందిన సి.శ్రీనివాసులుకు శుభాకాంక్షలు తెలియచేశారు. విద్యార్తులకు తన 28 సంవత్సరాలు అందిచిన సేవలను, పలువురు ఉపాద్యయులు,సిఆర్ పి లను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విజయోత్సవ ర్యాలీలపై నిషేధం

### నిబంధనలు అతిక్రమిస్తే
### తీవ్ర పరిణామాలు తప్పవు
### వెల్దుర్తి సిఐ పి.సురేష్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సిఐ పి.సురేష్‌కుమార్‌రెడ్డి

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ :** సార్వత్రిక ఎన్నికల ఫలితాలను దృష్టిలో ఉంచుకొని ఇరుపార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఈనెల 4వ తేదిన ఎటువంటి ర్యాలీలు, విజయోత్సవాలు, సంబరాలు నిర్వహించ కూడదని, అలా కాదని నిబందనలను అతిక్రమిస్తే ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వెల్దుర్తి సిఐ పి.సురేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణం నందు ఎస్సై పి.చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి మండలంలోని ఇరు పార్టీల నాయ కులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సిఐ పి.సురేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కౌటింగ్ నందు వెలువడే ఫలితాలను ఆధారం చేసుకొని గెలుపొందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవ్వరు కూడా సంబరాలు చేసుకోవడానికి అనుమతులు లేవని, ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అలాగే బాణసంచా కల్చడం, వీధులలో సంబరాలు చేసుకోవడం వంటివి కూడా నిషేదమన్నారు. చిన్న సంఘటనలు చోటుచేసుకున్నా ఇరు పార్టీల నాయకులపై, కార్యకర్తలపై తీవ్రస్థాయిలో కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి విషయంపై, ఇరు పార్టీలపై పోలీసు నిఘా ఉంచడం జరిగిందని, కావున ఎవ్వరు కూడా ఎన్నికల కమీషన్ నిబందనలను విస్మరించకుండా, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే జూన్ 6వ తేదిన ఎన్నికలలో విజయం సాధించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ సంబరాలు చేసుకోవడానికి తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది, ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్య
శనివారం | 01 | జూన్ 2024

పోటీ పరీక్షల ప్రత్యేకం

APPSC, TSPSC Group-1, 2 DSC Police Exams

# కరెంట్ అఫైర్స్

**1.** ఇటీవల" క్రిటికల్ మినరల్స్ సమ్మిట్ 2024 " ఎక్కడ జరిగింది?
1. హైదరాబాద్ 2. చెన్నై
3. న్యూఢిల్లీ 4. మధ్యప్రదేశ్

**2.** ఇటీవల" గోల్డ్మాన్ ఎన్విరాన్మెంటల్ ప్రైజ్ 2024 కి ఎంపికైన వారు ఎవరు ?
1. రాజేంద్రసింగ్ 2. తులసిగౌడ
3. అలోక్శుక్ల 4. రమేష్అగర్వాల్

**3.** భారతీయ హిమాలయ నది పరివాహక ప్రాంతాలలో గల సరస్సుల విస్తరణ పై ఇటీవల ఏ సంస్థ ఉపగ్రహ దేటా ఆధారిత విశ్లేషణను విడుదల చేసింది?
1. ISRO 2. DRDO
3.CSIR 4.NDMA

**4.** ఇటీవల ఆర్థిక అభివృద్ధిని ఉత్తేజపరిచేందుకు వాహన దిగుమతి పరిమితులను ఎత్తివేయాలని ఏ దేశం ఆలోచిస్తోంది?
1. బంగ్లాదేశ్ 2. శ్రీలంక
3. నేపాల్ 4. మయన్మార్

**5.** స్వలింగ సంబంధాలను నేరంగా పరిగణించేచట్టాన్ని ఏదేశ పార్లమెంట్ ఇటీవల ఆమోదించింది?
1. ఇరాన్ 2. ఇరాక్
3. వియత్నం 4. ఈజీప్ట్

**6.** ఇటీవల ఏ IIT "పోర్టబుల్ పవర్ టెక్నాలజీ కింద అభివృద్ధి చేసిన తేలికపాటి, కంపాక్ట్ ఇన్వర్టర్ కు పేటెంట్ను పొందింది?
1. IIT మద్రాస్
2. IIT పాట్నా
3. IIT కాన్పూర్
4. IIT బాంబే

**7.** ప్రతి సంవత్సరం ఏ రోజును"ప్రపంచ ట్యూనాదేగా "జరుపుకుంటారు?
1. 1 మే 2. 2 మే
3. 3 మే 4. 4 మే

**8.** ప్రపంచంలో అతిపెద్ద విమానాశ్రయం " అల్మక్తుమ్" అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఏనగరం నిర్మిస్తుంది?
1. బొంబాయి 2. దుబాయ్
3. లండన్ 4. న్యూయర్క్

**9.** అడవి మంటల కారణంగా ఇటీవల వార్తల్లో కనిపించిన "ఖీమ్ తాల్ సరస్సు "ఏ రాష్ట్రంలో ఉంది?
1. గుజరాత్ 2. కేరళ
3. ఉత్తరఖాండ్ 4. పంజాబ్

**10.** IQ Air ప్రకారం" మే 2 2024 నాటికీ ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరం గాఏ నగరాన్ని గుర్తించడం జరిగింది?
1. ఖాట్మండు 2. న్యూఢిల్లీ
3. హైదరాబాద్ 4. ముంబై

**11.** ఇటీవల, UPI లాంటి తక్షణ చెల్లింపు సేవలు కోసం NPCI ఏఆఫ్రికాన్దేశంతోఒప్పందం కుదుర్చుకుంది?
1. నమీబియా 2. టాంజనియా
3. కెన్యా 4. నైజీరియా



## ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా ఏ నగరాన్ని గుర్తించారు..?

**12.** ఇటీవల "గ్రీన్అస్కార్వ్టిగోల్డ్" అవార్డు2024 ను అందుకున్న వన్యప్రాణి జీవ శాస్త్రవేత్త?
1. తులసిగౌడ
2. పూర్ణిమ దేవి బర్మన్
3. అలీస్గార్గ
4. అమృతదేవి

**13.** ఇటీవల విడుదలైన OECD నివేదిక ప్రకారం 2024 -25 లో భారత ఆర్థిక వ్యవస్థ అంచనా వృద్ధిరేటు ఎంత?
1. 5.5% 2. 6.6%
3. 7.2% 4. 7.8%

**14.** ఇటీవల జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (GSI) అన్వేషకులు మేఘాలయాల్లోని ఏ కొండల్లో పురాతన శిలాజాలను కనుగొన్నారు?
1. దక్షిణ గారో కొండలు
2. తూర్పు ఖాసీ కొండలు
3. పశ్చిమ ఖాసీ కొండలు
4. జైంతీయహిల్స్

**15.** జెరేమియామనలే ఇటీవల ఏ దేశానికి కొత్త ప్రధానమంత్రిగా నియమితులయ్యారు?
1. మాల్దీవులు 2. సోలమన్దీవం
3. మారిషస్ 4. సింగపూర్

**16.** ఇటీవల భారత దేశపు మొట్టమొదటి "ఆస్ట్రో టూరిజం ప్రచారమైన " నక్షత్ర సభను "ఏ రాష్ట్రం ప్రారంభించింది?
1. ఉత్తరాఖండ్ 2. హర్యానా
3. హిమాచల్ ప్రదేశ్ 4. రాజస్థాన్

**17.** అరావళి పరిధిలో "అక్రమ మైనింగ్ ను నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఇటీవల ఏ రాష్ట్రాన్ని ఆదేశించింది?
1. గుజరాత్ 2. హర్యానా
3. రాజస్థాన్ 4. పంజాబ్

**18.** ఈ క్రింది వాటిలో సరైన అంశాలను గుర్తించండి?
1. ప్రపంచ నవ్వుల దినోత్సవం ను ప్రతి సంవత్సరం మే మొదటి ఆదివారం నాడు జరుపుకుంటారు.
2. ప్రపంచ నవ్వుల దినోత్సవంను తొలిసారిగా 1998 లోమే10 న ముంబైలో జరుపుకున్నారు
3. 1998లో ప్రపంచవ్యాప్త నవ్వుల యోగ ఉద్యమాన్ని డాక్టర్ మదన్ కటారియా ప్రారంభించారు
4. పైవన్నీ సరైనవే

**19.** వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్ 2024 లో భారత్ యొక్క స్థానం?
1. 159 2. 161
3. 155 4.175

**20.** ప్రపంచంలో టాప్-10 మిల్లెట్ ఉత్పత్తి చేసే దేశాల జాబితా (2024) సంవత్సరానికిగాను ఏ దేశం మొదటి స్థానంలో నిలిచింది?
1. భారతదేశం 2. నైజీరియా
3. చైనా 4. సూడన్

**జవాబులు:**

1)3 2)3 3)1 4)2 5)2 6)2
7)2 8)2 9)3 10)1 11)1 12)2
13)2 14)1 15)2 16)1
17)3 18)4
19)1 20)1



యన్.జగదీష్,
ఫ్యాకల్టీ, S. V అకాడమీ,
తిరుపతి.

# ఏపీ ట్రిపుల్ ఐటీ ప్రవేశాలు..

**ఇంటర్తో పాటు 6 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ కోర్సులను అందించేందుకు రాజీవ్ గాంధీ విజ్ఞాన సాంకేతిక విశ్వవిద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. నాణ్యమైన విద్యను చేరువగా నిలిచిన ట్రిపుల్ ఐటీలు గ్రామీణ విద్యార్థులకు వరంగా పేర్కొనవచ్చు.**




అంధ్రప్రదేశ్లో రాజీవ్ గాంధీ విజ్ఞాన సాంకేతిక విశ్వ విద్యాలయం నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్లను ఆర్కే వ్యాలీ, నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలులలో నిర్వహిస్తోంది. 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్-బీటెక్ (రెండేళ్ల ఇంటర్, నాలుగేళ్ల బీటెక్) ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 8వ తేదీ ఉదయం 11 గంటల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. జూన్లో ప్రవేశాల ప్రక్రియను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటు న్నారు. జులై నెలలో తరగతులు ప్రారంభమయ్యే లవకాశం ఉంది. అభ్యర్థులు వివరాలను https://www.rgukt.in వెబ్సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

**మొత్తం 4400 సీట్లు :** నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్లలో మొత్తం 4,400 సీట్లు భర్తీ చేస్తారు. వీటిలో అంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యార్థులకు 85శాతం సీట్లు కేటాయిస్తారు.

మిగిలిన 15 శాతం సీట్లకు అంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు తెలంగాణ విద్యార్థులు పోటీపడవచ్చు. ఈ సీట్లను తెలంగాణ, ఏపీ విద్యార్థులకు ఓపెన్ మెరిట్ కింద కేటాయిస్తారు.

**అర్హత:**

గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదో తరగతి పాసైన విద్యార్థులు మాత్రమే ప్రవేశాలకు అర్హులు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుంది. పభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివిన విద్యార్థులకు 4 శాతం డిప్రివేషన్ స్కోర్ను జోడించి మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారు.

**రిజర్వేషన్ వివరాలు**

మొత్తం సీట్లలో ఎస్సీలకు 15%,ఎస్టీలకు 6%, బీసీ-ఎ లకు 7%,బీసీ-బీలకు 10%, బీసీ-సీ లకు 1%,బీసీ-డిలకు 7%,బీసీ-ఇలకు 4%,వికలాంగులు (పీహెచ్లకు) 5%,సైనికోద్యోగుల పిల్లలకు 2%,ఎన్సీసీ 2%, క్రీడాకారులు, స్పోర్ట్స్కు చెరో అర శాతం రిజర్వేషన్ కేటాయించారు.

బాలికలకు అన్ని కేటగిరీలలో మూడోవంతు సీట్లు కేటాయించారు.

**ముఖ్యమైన తేదీలు:**

* నోటిఫికేషన్ విడుదల తేదీ: మే 6, 2024
* ఆన్లైన్ దరఖాస్తులు ప్రారంభం: మే 8, 2024
* తరగతుల ప్రారంభం: 2024 జులైలో.

### శిల్పకళలో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు

టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవెంకటేశ్వర సాంప్రదాయ ఆలయ శిల్ప కళాశాల శిల్పకళ మీద ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానిస్తోంది.

* 2024-25 విద్యాసంవత్సరానికి సాంప్రదాయ కళంకారి కళలలో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి అప్లికేషన్లు ఆహ్వానిస్తోంది.
* 10వ తరగతి పాసైన వాళ్లు ఈ కోర్సులకు అప్లయ్ చేసుకోవచ్చు.
* డిప్లొమా కోర్సు వ్యవధి నాలుగేళ్లు, సర్టిఫికేట్ కోర్సు రెండేళ్ల వ్యవధిగా నిర్ణయించారు.
* దరఖాస్తు ప్రక్రియ మే 1వ తేదీ నుంచి ప్రారంభమైంది. జూన్ 17వ తేదీ వరకు కాలేజీలో అప్లికేషన్లు అందుబాటులో ఉంటాయి.
* పూరించిన దరఖాస్తులను జూన్ 17వ తేదీ సాయంత్రంలోపు కళాశాలలో సమర్పించాలి.
* కోర్సులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం https://www.tirumala.org/SVISTA.aspx వెబ్సైట్ లేదా కాలేజీ ఆఫీస్ నంబర్లు 0877-2264637, 9866997290 సంప్రదించాలి.

## అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు - డిఎస్పి షర్ఫుద్దీన్

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు జూన్ 4న కౌంటింగ్ సందర్భంగా గ్రామాలలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆళ్ళగడ్డ డిఎస్పి షర్ఫుద్దీన్ తెలిపారు. డిఎస్పి ఆధ్వర్యంలో స్థానిక అడ్డవాగు సెంటర్ నుండి మల్లేవేముల బస్టాండ్,మైన్‌బజార్, చిన్నమకానం, ముత్యాలపాడు బస్టాండు,పెద్దమకానం,గాంధీ సెంటరు మీదుగా పోలీసు స్టేషన్ వరకు సరిహద్దు భద్రతా దళాలతో కవాతు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 144,పోలీసు యాక్ట్ 30 అమలులో ఉందని ఎక్కడ కూడా విజోయత్సవ ర్యాలీలు,సంబరాలు,బాణసంచా పేల్చడం నిషేదమన్నారు. కౌంటింగ్ ప్రాంతాలకు ఏజెంట్లు మినహా ఎవరికి అనుమతు లు లేవన్నారు. గ్రామాలలో కౌంటింగ్ సందర్భంగా ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమం లో సిఐలు హనుమంతు నాయక్,చంద్రబాబు, ఎస్ఐలు రమణయ్య, నర్సింహులు, నాగేశ్వర రావు,రామాంజనేయరెడ్డి,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


డిఎస్పి ఆధ్వర్యంలో కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

# నకిలీ పత్రాలతో భూమి పట్టా మార్చేశారు..!

**వారసత్వంగా వచ్చిన భూమి పై పెద్దనాన్న కన్ను.. తనకు న్యాయం చేయాలంటూ ఉప్పర ఈరన్న డిమాండ్**



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** తనకు వారసత్వంగా సంక్రమించివచ్చినపట్టా భూమిని తన పెద్దనాన్న అయినా ఉప్పరరామలింగప్ప నకిలీ పత్రాలు సృష్టించి అక్రమంగా పట్టాదారు పాసుపుస్తకం పొందాడు. రామలింగప్ప అక్రమంగా పొందిన పట్టాదారు పాసు పుస్తకాన్ని వెంటనే రద్దు చేసి తనకు న్యాయం చేయాలని ఉప్పర ఈరన్న డిమాండ్ చేశారు. గురువారం పెద్దకడుబూరు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్దకడుబూరు గ్రామంలో సర్వే నెంబరు 566 బి-2బి1లో0-28సెంట్ భూమి ఉందన్నారు. అలాగే మరో సర్వేనంబర్ 558ఎలో0-18సెంటు భూమి మాపూర్వీకుల నుంచి ఆస్తి మాకు సంక్రమించిందని అయన అన్నారు. అయితే మా పెద్దనాన్న రామలింగ గప్ప నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి మాకు చెందిన ఆస్తిని తనపేరు వ్రాయించుకొని పట్టాదారు పాసు పుస్తకం పోందాడని ఆయన ఆరోపించారు. తనకు చెందాల్సిన ఆస్తీ విషయంపై స్థానిక రెవెన్యూ అధికారులను ఇటు రామలింగప్పను నిలదీయడం జరిగిందన్నారు. అంతే కాకుండా అక్రమానికి పాల్పడిన రామలింగప్ప పై. ఆదోని ఆర్డీఓకు ఫిర్యాదు చేయడం జరిగిందని అంతేకాకుండా ఆదోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్ఓఆర్ కేసు పెట్టడంతో ఆర్డీఓ ముందే రామలింగప్ప తనతప్పును తెలుసు కొని తన పట్టాదారు పాస్ పుస్తకంఅధికారులతో రద్దు పరచుకొన్నాట్లు ఆయన చెప్పారు. అయితే గత కొద్ది రోజులు క్రితం రామలింగప్ప. శివకుమార్ ఇద్దరు కలసి పెద్దకడుబూరు మండల డిప్యూటీ తహసీల్దార్. మండల సర్వేర్ జయమ్మ. శ్రీనివాసులు కలిసి కుట్ర పన్ని ఈరన్నకుచెందాల్సిన ఆస్తిని ఆర్ ఒ ఆర్ కేసులో పెండింగ్‌లో ఉందని అధికారులు రామలింగప్పకు చెప్పి మళ్ళీ రామలింగప్ప నకిలీ సర్వేర్ రిపోర్టు. డాక్యుమెంట్లను తయారు చేయించి వెబ్ ల్యాండ్ లోరామలింగప్ప పేరుమీద టైటిల్ డీడ్ ఉందని చెబుతున్నారని అన్నారు. అలాగే గతంలో క్యాన్సిల్ చేసిన పట్టాదారు పాసు పుస్తకం రామలింగప్పకు ఎలా ఇచ్చారని పాస్ పుస్తకాల ఖాతా నెంబరు ఎలా ఇస్తారని గతంలో ఈ సర్వే నెంబరుకు సంబంధించిన భూమి ఇంతకుముందు కోర్టు 145 సెక్షన్ విధించిందని తనకు ఎలాంటి నోటీసులు కూడా ఇవ్వకుండా సర్వే చేశారని అధికారులను నిలదీసినట్లు చెప్పారు. తనకుఅన్యాయం చేసిన రామలింగప్ప. సంబంధిత అధికారులు పై స్పందన కార్యక్రమంలో లోకాయుక్తలో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు అలాగే తనకు రెవెన్యూ సిబ్బంది. రామలింగప్ప. శివకుమార్‌లు కలసి చేసిన అన్యాయం పై పెద్దకడుబూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే తాను వీరి పై లోకాయుక్త కోర్టులో ఫిర్యాదు చేయడంపై డిప్యూటీ తహసీల్దార్, రామలింగప్ప, శివకుమార్ కలిసి నన్ను బెదిరింపులకు గురి చేస్తున్నారని అందువల్ల వీరివల్ల తనకు ప్రాణహాని ఉందని అందువల్ల వీరి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పెద్దకడుబూరు పోలీసులను కోరడం జరిగిందని ఆయన చెప్పారు.

# భద్రత ఏర్పాట్లను కర్నూలు రేంజ్ డిఐజి పరిశీలన

**ఓట్ల లెక్కింపు కేంద్రమైన కర్నూలు రాయలసీమ యూనివర్సీటిలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలి..**
**కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్. విజయరావు, జిల్లా కలెక్టర్ డా. సృజన, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్**



**కర్నూలు క్రైం,మేజర్ న్యూస్ :** జూన్ 4 వ తేదిన కర్నూలులో జరగనున్న సార్వత్రిక ఓట్ల లెక్కింపు సంధర్భంగా శుక్రవారం కర్నూలు, బి. తాండ్రపాడు సమీపంలో ఉన్న కౌంటింగ్ కేంద్రమైన కర్నూలు రాయలసీమ యూనివర్సీటిలో కర్నూలు రేంజ్ డిఐజిసిహెచ్. విజయరావు, జిల్లా కలెక్టర్ డా. సృజన, జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్‌లతో కలిసి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. విజిటర్స్ రిజిస్టర్‌లో డిఐజి సంతకం చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సిసి కెమెరాల కమాండ్ కంట్రోల్, కౌంటింగ్‌హాల్‌ను, భద్రపరిచిన ఈవిఎంల స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. అనంతరం ఓట్ల లెక్కింపునకు తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్ల గురించి కర్నూలు రేంజ్ డిఐజి కర్నూలు తాలుకా పోలీసుస్టేషన్‌లో పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రత ఏర్పాట్ల పై ఆరా తీసి, పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని పలు సూచనలు, సలహాలు చేసి దిశా, నిర్దేశం చేశారు. ట్రబుల్ మాంగర్స్ కు కౌన్సిలింగ్ చేయాలని, నిఘా ఉంచాలని భద్రత పరంగా కౌంటింగ్ సెంటర్ వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, గుర్తింపు కార్డులను పరిశీలించిన తర్వాత మాత్రమే లోపలికి అనుమతించాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజున అభ్యర్థులు మరియు కౌంటింగ్ ఏజెంట్ల గుర్తింపు కార్డులను మరియు ఆర్.ఓలను ఇచ్చే ధ్రువీకరణ పత్రాన్ని తనిఖీ చేసి పంపే విధంగా చర్యలు చేసుకోవాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ కు వచ్చేవారు మొబైల్స్ తీసుకురాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ సెంటర్‌కి వచ్చే అభ్యర్థులు వారి ఏజెంట్లకు సంబంధించిన వాహనాలు వారికి నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశంలో మాత్రమే పార్కింగ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల ఓట్ల లెక్కింపును దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని ట్రబుల్ మెంబర్స్, రౌడీషీటర్స్ ,మరియు నేరచరిత్ర గల వారిపై నిఘా ఉంచి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండేలా చర్యలు తీసుకోవాలని,నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కర్నూలు రేంజ్ డిఐజి సూచించారు. ఈ కార్యక్రమంలో డిఐజి వెంట అడిషనల్ ఎస్పీలు నాగరాజు, నాగబాబు, డిఎస్పీలు విజయశేఖర్, బాబు ప్రసాద్, సీతారామయ్య, శివ నారాయణస్వామి, శ్రీనివాసరెడ్డి, ట్రైని డిఎస్పీ భావన, సిఐలు ఉన్నారు.



## యోగ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తాం- డిఎస్డివో భూపతిరావు

**- యోగ శిక్షకులకు క్రీడా పరికరాలను అందజేత**



**కర్నూలు స్పోర్ట్స్,మేజర్‌న్యూస్ :** వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారుడి ప్రతిభను ప్రతి శిక్షకుడు వెలికి తీయాలని డిఎస్డివో భూపతిరావు వ్యాఖ్యానించారు. శుక్రవారం కర్నూలు నగరంలోని అవుట్డోర్ స్టేడియం నందు వేసవి శిక్షణ శిబిరాల శిక్షకులకు కేఎంసి సహకారంతో క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా భూపతిరావు మాట్లాడుతూ రాష్ట్రంలోవేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్న ఏకైక జిల్లాగా కర్నూలు జిల్లా నిలిచిందన్నారు. శిక్షకులు అంకితభావంతో యోగ చేయించి ఆరోగ్యవంతమైన క్రీడాకారులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీ సిబ్బంది చేసుకొని శేష పని, ఇర్ఫాన్, ఇమ్రాన్, గంగాధర్‌లు తదితరులు పాల్గొన్నారు.

# గుంత తవ్వారు.. పూడ్చడం మరిచారు..!

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు పట్టణంలోని వీవర్స్ కాలనీలో కూరగాయలు దుకాణాల ముందు మున్సిపల్ సిబ్బంది పైపు లైన్ మరమ్మతుల కోసం గుంత తవ్వారు.. పూడ్చకుండా వదిలేశారు. ఆ దారి వైపు వెళ్లే వాహనదారులు పాదచారులు ఇబ్బందులు గురవుతున్నారు. ఆదమరిస్తే తవ్విన గుంతలో పడే పరిస్థితి నెలకొంది. గుంత తవ్వి మున్సిపల్ సిబ్బంది మూడు రోజులు అవుతున్న ఇంతవరకు పూడ్చలేదని ఆ ప్రాంత వాసులు తెలిపారు. కొన్ని వార్డుల్లో మ్యాన్ హెూల్ మూతలు కూడా ప్రమాద కరంగా మారాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.


గుంతను పూడ్చకుండా వదిలేసిన దృశ్యం

# డోన్ నియోజకవర్గ ఓట్ల మాక్ కౌంటింగ్

**(మొదటి పేజి తరువాయి)**

ఈ మాక్ కౌంటింగ్ సహాయపడుతుందని వారంటున్నారు. డోన్ నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లతో పాటు పోస్టల్ బ్యాలెట్ లెక్కించేందుకు మరో నాలుగు టేబుళ్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని వారు వివరించారు. మొత్తం 21 రౌండ్లలో ఓట్ల లెక్కింపు కొనసాగుతుందని వివరించారు. ఓట్ల లెక్కింపు పూర్తి కావడానికి సాయంత్రం అయిదు గంటలు అయ్యే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక ఆ వివరాలు ఎన్నికల కమిషన్‌క పంపిస్తామని అక్కడి నుంచి ఆదేశాలు వచ్చిన తరువాత విజయం సాధించిన అభ్యర్థి పేరును అధికారికంగా ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ మాక్ కౌంటింగ్‌లో ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రతినిధులతో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు పాల్గొన్నట్లు ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు.

## కౌంటింగ్ ప్రక్రియలో పొరపాట్లకు తావు లేకుండా చూడాలి



**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** కౌంటింగ్ ప్రక్రియలో పొరపాట్లకు తావు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా. జి.సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సాధారణ ఎన్నికలు 2024 కౌంటింగ్ నిర్వహణపై కౌంటింగ్ సూపర్వైజర్స్, కౌంటింగ్ అసిస్టెంట్స్ కు ఇచ్చే రెండవ విడత రెండవ దఫాలుగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 4వ తేదిన కౌంటింగ్ ప్రక్రియలో ఈవిఎం కౌంటింగ్ ఒకటి, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఉంటాయన్నారు. జూన్ 2వ తేదిన ర్యాండమైజేషన్ ద్వారా పోస్టల్ బ్యాలెట్, ఈవిఎంలు లెక్కింపు ఎవరు చేస్తారు అనేది తెలిసే అవకాశం ఉంటుందన్నారు. జూన్ 3వ తేదిన కౌంటింగ్ సిబ్బంది మొత్తాన్ని రాయలసీమ యూనివర్సిటీలోని కౌంటింగ్ కేంద్రాలకు తీసుకొని వెళ్లి వారు కౌంటింగ్ విధులు నిర్వహించాల్సిన గదులను రిటర్నింగ్ అధికారులు చూపించడంతో పాటు అక్కడ ఏమైనా సందేహాలు ఉన్న నివృత్తి చేయడం జరుగుతుందన్నారు. దీని ద్వారా 4వ తేది కౌంటింగ్ సిబ్బంది ఎటువంటి హడావిడి లేకుండా వారికి కేటాయించిన నియోజకవర్గాల కౌంటింగ్ హాల్‌లలో విధులకు హాజరు అయ్యే అవకాశం ఉంటుందన్నారు. మొబైల్ ఫోన్లు కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేదన్నారు, ఒకవేళ తీసుకొని వస్తే అక్కడ ఏర్పాటు చేసిన అటెండెన్స్ కౌంటర్ వద్దే వాటిని డిపాజిట్ చేయాల్సి ఉంటుందని, కేవలం అబ్జర్వర్లు, రిటర్నింగ్ అధికారులు, ఈటిపిబిఎస్ రిటర్నింగ్ అధికారులకు మాత్రమే మొబైల్ ఫోన్లకు అనుమతి ఉందన్నారు. కౌంటింగ్ కేంద్రాలలో విధులు నిర్వహించే సిబ్బంది జూన్ 4వ తేదీ ఉదయం 5 గంటలకు కలెక్టరేట్ కు వస్తే అక్కడి నుండి వారిని బస్సుల ద్వారా కౌంటింగ్ కేంద్రాలకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. లా అండ్ ఆర్డర్ దృష్ట్యా సొంత వాహనాలలో వచ్చి ఇబ్బంది పడకూడదని కలెక్టర్ కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. తదుపరి పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఎలా చేయాలి అని మార్గదర్శక సూత్రాలను గురించి కలెక్టర్ వివరించారు. అనంతరం ఈవిఎం కౌంటింగ్ నిర్వహణపై ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారులు సోమశేఖర్ రెడ్డి, సిద్దలింగమూర్తి, పోస్టల్ బ్యాలెట్ పై పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సలీంబాషా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కౌంటింగ్ సిబ్బందికి కౌంటింగ్ పై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మధుసూదన్ రావు, ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారులు సోమశేఖర్ రెడ్డి, మారుతి ప్రసాద్, సిద్దలింగమూర్తి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సలీంబాషా, కౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూర్య



### త్వరితగతిన ఎన్నికల ఫలితాలను

# మీడియాకు అందించాలి

### జిల్లా ఎన్నికల అధికారి డా జి.సృజన



**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** మీడియా సెంటర్, కమ్యూనికేషన్ సెంటర్ల ద్వారా త్వరితగతిన ఎన్నికల ఫలితాలను మీడియా కు అందించాలని జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి జి సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక రాయలసీమ యూనివర్సిటీలోని మీడియా సెంటర్, కమ్యూనికేషన్ సెంటర్ లో ఏర్పాట్లనుజిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కంట్రోల్ రూంలో స్ట్రాంగ్ రూమ్ లైవ్ ఫీడ్ ను పరిశీలించిన అనంతరం ఈవిఎమ్ యంత్రాలను భద్రపరచిన ఇంజనీరింగ్ బ్లాక్ ను, కౌంటింగ్ హాల్ లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముందుగా రాయలసీమ యూనివర్సిటీ లోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ ఏర్పాట్లను పరిశీలిస్తూ మీడియా సెంటర్ లోని ఎల్ఈడి స్క్రీన్ లో స్ప్లిట్టర్ ఏర్పాటు చేసి అందులో 4 న్యూస్ ఛానల్స్, విడివిడిగా ఏర్పాటు చేసిన 4 టివి లలో 4 న్యూస్ ఛానల్స్ మొత్తం 8 న్యూస్ ఛానల్స్ వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మీడియా వారు కౌంటింగ్ హాల్ లో విజువల్స్ తీసుకునేందుకు 5 నుండి 6 మందిని వాహనంలో తీసుకొని వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలని సమాచార పౌర సంబంధాల అధికారిని ఆదేశించారు.అదే విధంగా మీడియా సెంటర్ లో ఇంటర్నెట్, కంప్యూటర్, ప్రింటర్, స్కానర్ ఏర్పాట్ల గురించి సమాచార పౌర సంబంధాల అధికారిని అడిగి తెలుసుకున్నారు. తదనంతరం ఇంజనీరింగ్ బ్లాక్ లోని కంట్రోల్, కమ్యూనికేషన్ రూమ్ ను పరిశీలిస్తూ కమ్యూనికేషన్ రూమ్ అని తెలిసే విధంగా బోర్డు ఏర్పాటు చేయించాలని డిఆర్ఓ ను ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిఆర్ఓ మధుసూదనరావు, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ నాగరాజు, కుడా వైస్ చైర్మన్ వెబ్ కాస్టింగ్ నోడల్ అధికారి ప్రతాప్ రెడ్డి, సమాచార పౌర సంబంధాల అధికారి జయమ్మ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకట లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి

### జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య



**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం కౌంటింగ్ జూన్ 4 వ తేదీ ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, ఉదయం 8.30 గంటల నుండి ఈవీఎంల కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవు తుందని అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాణ్యం నియో జకవర్గ ఆర్వో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తెలిపారు.శు క్రవారం కలెక్టరేట్ లోని మిని కాన్ఫరెన్స్ హాల్ లో పాణ్యం నియోజకవర్గం కౌంటింగ్ ఏర్పాట్లపై మీడియా ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహిం చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు 2024 లో భాగంగా పాణ్యం నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ రాయలసీమ యూనివర్సిటీలో ని మొదటి అంతస్తు ఇంజనీరింగ్ బ్లాక్ లో నిర్వహించడం జరుగు తుందన్నారు. పార్ల మెంట్ నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ కొరకు 14 టేబుల్స్ ని ఏర్పాటు చేయడమైందని, పాణ్యం అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి 14 టేబుల్స్ ని ఏర్పాటు చేయడం జరిగింద న్నారు. పోస్టల్ బ్యాలెట్ కు సంబంధించి దాదాపు 5700 పోస్టల్ బ్యాలెట్ లను 6 టేబుల్స్ ద్వారా రెండు రౌండ్లలో లెక్కించడం జరుగుతుందని అన్నారు. ప్రతి టేబుల్ కి ఒక అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాణ్యం నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ 26 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బందికి కౌంటింగ్ పై ఇప్పటికే రెండు పర్యాయాలు శిక్షణ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. కౌంటింగ్ సిబ్బంది ఏ టేబుల్ కు ఎవరిని కేటాయించామనే విషయం కౌంటింగ్ రోజు ఉదయమే ర్యాండమైజేషన్ ద్వారా తెలియచేయడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రం దగ్గర ఈవీఎంలకు సంబంధించిన బెల్ కంపెనీ ఇంజనీర్లు కూడా అందుబాటులో ఉంటారన్నారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ఈవీఎం యంత్రాలను కలెక్టరేట్లోని ఈవీఎం గోడౌన్స్ కు చేర్చడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ రోజున కౌంటింగ్ సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లు ఇతర ఎన్నికల సిబ్బంది ఖచ్చితంగా ఐడెంటి కార్డులు తీసుకొని రావాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది ఎవరు కూడా కౌంటింగ్ హాల్ లోనికి మొబైల్ ఫోన్స్ తీసుకొని రాకూడదని, ఒకవేళ తీసుకుని వస్తే వాటిని మొబైల్ డిపాజిట్ సెంటర్లో డిపాజిట్ చేసి కౌంటింగ్ హాల్ లోకి రావాల్సి ఉంటుందని జేసీ తెలియజేశారు.



### పదవి విరమణ పొందిన 9 మంది పోలీసులను సన్మానించిన

# కర్నూలు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్



**కర్నూల్‌క్రైమ్, మేజర్‌న్యూస్ :** సుదీర్ఘకాలం పోలీసుశాఖలో పని చేసి పోలీసు సిబ్బంది పదవి విరమణ పొందడం అభినందనీయమని కర్నూలు జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ అన్నారు. ఈ సంధర్భంగా శుక్రవారం పదవి వీరమణ పొందిన పిసిఆర్ కర్నూలు ఎస్సై - ఎన్. అబ్దుల్ అజీజ్ . స్పెషల్ బ్రాంచ్ ఎస్సై డి. రాజన్న. కర్నూలు ఒకటవ పట్టణ ఎస్సై ఎస్. ఎమ్. డి. జాఫర్ హుస్సేన్. కర్నూలు ఒకటవ పట్టణ ఎస్సై - పి. వి. రామిరెడ్డి ఎఆర్ ఎస్సై ఎస్. చంద్రశేఖర్ రావు. ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎస్. చెంచయ్య, కర్నూలు ఒకటవ పట్టణ ఎఎస్సై జి. ఇన్నయ్య, చిప్పగిరి పియస్ ఎఎస్సై ఎస్. జి. నజీర్ అహమ్మద్. ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ ఆర్. హరిబాబు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లా ఎస్పీ శాలువ, పూలమాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. పోలీసుశాఖకు వారు అందించిన సేవలను జిల్లా ఎస్పీ గారు కొనియాడారు. కుటుంబాలతో సంతోషంగా గడపాలని, పదవివీరమణ పొందిన తర్వాత ఏమైనా సమస్యలుంటే నేరుగా జిల్లా ఎస్పీ గారిని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నాగరాజు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ నాగబాబు, స్పెషల్ బ్రాంచ్ సిఐ నాగరాజ్ యాదవ్, ఆర్ ఐలు జావేద్, నారాయణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు , పదవి విరమణ పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అల్లర్లు సృష్టిస్తే... కఠిన చర్యలు

### - పట్టణంలో కవాతు నిర్వహించి పోలీసులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** సార్వత్రిక ఎన్నికల లెక్కింపును పురస్కరించుకొని ఎవ్వరైనా అల్లర్లు సృష్టించి శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని డిఎస్పీలు శ్రీనివాసరావు, రమణరావులు, సిఐ నాగభూషన్, లక్ష్మీనారాయణలు అన్నారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్ నుంచి నంద్యాల టర్నింగ్, గౌడు సెంటర్, ఆర్టిసి బస్టాండ్ , తహశీల్దార్ కార్యాలయం, పాతబస్టాండ్ మీదుగా పోలీసు స్టేషన్ వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఎస్పి రఘువీర్ రెడ్డి ఆదేశాల మేరకు డిఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలో పోలీసు కవాతు నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికల లెక్కింపును దృష్టిలో ఉంచుకొని శాంతి భద్రతలకు భంగం కలగకుండా ఉండేందుకు కవాతు నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికల లెక్కింపు, అనంతరం బాణాసంచా కాల్చడం, ఊరేగింపులు చేస్తు అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ రోజున ప్రతి ఒక్కరు సహకరించి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు భూపాలుడు, నారాయణరెడ్డి, హరిప్రసాద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

# కార్డుదారులకు జొన్నల పంపిణీ

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులకు బియ్యంను, సబ్సిడీపై చక్కెరను ప్రతి మాసంలో వాహనాల ద్వారా ఇంటివద్దనే పంపిణీ చేయడం జరుగుతున్నదని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మే మాసలంలో 533.182 మెట్రిక్ టన్నుల జొన్నలను 2,05,839మంది కార్డుదారులకు బియ్యంకు బదులుగా 3కిలోల జొన్నలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అదే విధంగా ఈనెల కూడా 3కిలోల జొన్నలను చౌకధరల దుకాణం నుంచి ఎండియు వాహనం ద్వారా జిల్లాలోని కార్డు దారులకు పంపిణీ చేయడం జరుగు తుందని తెలిపారు.



జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

# చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### - ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మాక్ డ్రిల్

### - జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి

**నంద్యాలక్రైం, మేజర్‌న్యూస్:** చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో శుక్రవారం పట్టణంలోని శ్రీనివాస సెంటరు ప్రాంతంలో జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి పోలీసులకు మాక్ డ్రిల్ నిర్వహించారు. మాక్ డ్రిల్‌లో ముందుగా అవాంచనీయ సంఘటనలు, హింసాత్మక చర్యలు చోటు చేసుకున్నపుడు ఎలాంటి చర్యలు చేపట్టాలో కళ్లకు కట్టినట్లు చూపిం చారు. అల్లరి మూకలను సంఘటనా స్థలం నుండి తరిమికొట్టే విధానాన్ని ఆ సందర్భంలో పరిస్థితులను ఎలా అదుపు చేయాలో, గాయపడ్డ వారికి చికి త్స అందించడం ఎలాగో మాక్ డ్రిల్‌లో పోలీసులు ప్రదర్శించారు. ఈ సందర్భం గా జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ సెక్షన్ 144 సీఆర్‌పీసీ, 30 పోలీసు యాక్ట్ అమలులో ఉందన్నారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడ్డా, చట్టాన్ని చేతిలోకి తీసుకో వాలని ప్రయత్నించినా కఠిన చర్యలు తప్పవన్నారు. కౌంటింగ్ సందర్భంగా అమలులో ఉన్న నిబంధనలనున ప్రతి ఒక్కరు తూచా తప్పకుండా పాటించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజల ధన, మాన, ప్రాణ నష్టం వాటిల్లకుండా చేపట్టే చర్యలను పోలీ సులు మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కలిగిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రవీన్ కుమార్, నంద్యాల టౌన్ డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి, ఇన్ స్పెక్టర్లు నరసింహులు, చలపతి, రాజారెడ్డి, శివకుమార్ రెడ్డి, దస్తగిరి బాబు, ఇస్మాయిల్, ఏఆర్ ఇన్‌స్పెక్టర్ శ్రీని వాసులు, ఎస్ఐలు మల్లికార్జున, బీటి వెంకట సుబ్బయ్య, నవీన్‌బాబు, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.



మాక్ డ్రిల్‌లో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి